# సస్పెన్స్

చిట్టారెడ్డి సూర్యకుమారి

**తూ**రుపు వాకిళ్ళు తెరుచుకున్నాయి.

ఉదయించిన కర్మసాక్షి ఉదయాద్రి నుండి గగనానికి ఎక్కిపోయాడు.

ఆదివారం సెలవురోజు, చల్లగా కాసేపు పడుకుందామంటే ఏదో ముంచుకు పోయినట్లు వచ్చేశాడు.

కిటికీలో నుంచి దూసుకు వచ్చిన కిరణాలను చూచి మంచం దిగింది చిత్ర.

స్నానాదులు ముగించి వచ్చేటప్పటికి బల్లమీద టిఫిన్ రెడీగా వుంది.

ఆదివారం ఇంట్లో అందరూ పూటారు కలిసి భోజనాలు చేస్తారని ప్రొద్దున్న టిఫిన్ నుంచి రాత్రి భోజనంవరకు అన్నీ స్పెషల్స చేస్తుంది అమ్మ 'నిద్ర లేవండి-స్నానాలు ముగించండి — పాలు తాగండి, నాష్టా చేయండి!', అని ఆ రోజు ఎవర్నీ తొందర చేయదు చేసినా వినరు. అందరూ రిలాక్సింగ్ మూడ్‌లో వుంటారు.

నాన్న తొమ్మిది గంటలవరకు పేపరు పట్టుకుని గడ్డం మరో అంగుళం పెరిగినాక రెండోసారి కాఫీతాగి అప్పుడు షేవింగ్ మొదలు పెట్టతారు.

వేడి వేడి దోసెమీద అమ్మ పెట్టి వెళ్ళిన వెన్న కరుగుతూంటే చూస్తుంది చిత్ర.

నాన్న షేవింగ్ ప్రారంభించాక అమ్మ సంభాషణ మొదలు పెట్టింది.

"శిల్పని చూచుకోటానికి రేపు వస్తారు..."

"చిత్రకి కూడా సంబంధం చూచి ఒకసారి చేస్తే ఖర్చులు కలిసి వస్తాయి .."

శిల్ప వాళ్ళకి నచ్చాలి కట్నం కానుకలు అన్నీ కుదిరితె ఫిబ్రవరిలో పెళ్ళి చేయవచ్చు.

రేపు వాళ్ళు వచ్చి వెళ్ళేకగాని ఏ సంగతి తెలియదు అందాక సస్పెన్స్!!

ఈజీ చైర్‌లో పడుకుని తలారబెట్టుకుంటూ జ్యోతి చదువుతున్న సాహిత్య అంది "హమ్మయ్య.... శేఖర్ గుండెలమీద తల ఆనించి నిశ్చింతగా కళ్ళు మూసుకుంది మీరా. సస్పెన్స్ తీరిపోయింది"

అంతలో 'రచన' వీక్లీ పట్టుకు వచ్చింది,

"ఏయ్ రచనా ఇలా ఇవ్వు-యిప్పుడే



చదివి యిస్తా" అని సాహిత్య అడుగుతుంటే రచన పరుగెత్తుకుపోయింది.

"నవీన్ వారి ప్రేమ గురించి ఇంట్లో చెప్పేస్తా నన్నాడు, వారి పెళ్ళికి వాళ్ళ

ంకి కరిస్తారో లేదో? అదే పెద్ద సస్పెన్స్‌గా వుంది" అని చిత్ర అనుకుంటూంది.

"నవీన్ అమ్మా నాన్నని కాదని తనను పెళ్ళి చేసుకుంటాడా! చేసుకోక పోతే! అమ్మో! నవీన్ చూడక తను వుండలేదు. నవీన్‌ను కాదని మరొకరిని పెళ్ళి చేసుకో లేదు..." అని చిత్ర తలుస్తూ కాఫీగ్లాసు పట్టుకుని వరండాలోకి వచ్చింది.

సినిమా రివ్యూ చూస్తున్న తాతయ్య 'చిత్రా! అమావాస్య చంద్రుడు చూశావా! ... చివర్లో గుడ్డివాడికి పెళ్ళి అవుతుందా!'

సినిమాకి వెళ్ళి చూచేదాక ఆ సస్పెన్స్ భరించలేని తాతయ్య చిన్న పిల్లాడిలా అడుగుతున్నాడు

నవ్వుతూ "చూచి వచ్చి చెప్పుతాను తాతయ్యా'

నానమ్మ గదిలోనుంచి దగ్గు వినిపించింది. ఆ తర్వాత మాటలు "నిన్న ఎక్సరే తీశారు. రేపు రమ్మన్నారు రిజల్టును చెప్ప టానికి, ఏం జబ్బు అంటారో..."

చివరికి నానమ్మ కూడ సస్పెన్స్‌తో బాధ పడుతూంది.

సస్పెన్స్ భరించలేని అమ్మ సీరియల్స్ చదవటం మానేసింది. చిత్ర నవ్వుకుంటూ తన గదిలోకి వెళ్ళింది.

పుస్తకంలో దాచుకున్న నవీన్ ఫోటో తీసి ఎవ్వరూ చూడకుండ ముద్దు పెట్టుకుని దాచేసింది. వారి ప్రేమకు వయస్సు ఐదు సంవత్సరాలు, అయినా ఇప్పుడిప్పుడే ప్రేమలో పడినట్లు కొత్తగా వుంటుంది. ప్రేమకు వృద్ధాప్యం లేదు. వెగటు లేదు. ఏ రోజుకారోజు కొత్తగా నవీన్‌ను కలు సుకోబోతుంటే థ్రిల్లింగ్‌గా వుంటుంది. చూచేదాక-ఆరాటం వచ్చేస్తుంటే గుబు లుగా మళ్ళీ రేపు కొరకు వళ్ళంతా కళ్ళు చేసుకుని ఎదురు చూడటంలోనే సంవత్స రాలు గడచి పోయాయి. తనకు డిగ్రీ వచ్చింది. బాంకులో వుద్యోగం దొరికింది.

నవీన్ ఇంజనీర్ అయ్యాడు. ఆర్థిక స్వాతంత్ర్యం వచ్చింది. అందుకే పెళ్ళికి తొందర పడుతున్నాడు.

అతని తొందరకు ఆవేశానికి నవ్వుతుంటే "మనకు పెళ్ళి అయివుంటే ఐదేళ్ళ కొడుకు వుండేవాడు. అని అంటే....

"మా అమ్మచాలు వస్తే ఈ పాటికి నల్గురు వుండేవాళ్ళు," ఆ మాటకు నవీన్ కళ్ళు పెద్దవి చేసుకుని చూస్తుంటే కిల కిల నవ్వింది చిత్ర.

వారి ప్రేమ సంగతి ఇంట్లో చూచా యగ తెలుసు ముందు ఆ ప్రాబ్లెమ్ క్లియర్........ అయితే వీళ్ళకి చెప్ప వచ్చు..............

తీరికగా పడుకుని చిత్ర నవీన్‌గురించి కలలు కంటూ కాలక్షేపం చేసింది.

భోజనాలు అయ్యాక తయారై కమల ఇంటికి వెళ్ళుతున్నానని చెప్పి వచ్చింది.

కమల ఇంట్లో నవీన్ చిత్రకోసం కాచు కుని వున్నాడు. ఆలస్యం భరించ లేనట్లు ఎదురొచ్చాడు నవీన్ చూచి ఎన్నాళ్ళో అయినట్లు చిత్ర చూస్తుంటే" చిత్రా ఇంట్లో నీ గురించి చెప్పేశాను.... నిన్ను చూపిస్తానని చెప్పాను"

చిత్రకు భయం వేసింది ఏ వంక పెట్టి కాదంటారోనని.

వాళ్ళు గొప్పవాళ్ళు. నవీన్‌కు లోలెడు కట్నం ఇస్తామని వస్తున్నారని తెలుసు. అందుకే భయం.

చిత్ర భయం కనిపెట్టి "పెద్దవాళ్ళకి చెప్పటం మన ధర్మం, వారికిష్టమైతే చేస్తారు. లేదా మనమే చేసుకుంటాం-" అంటూ చిత్రను ప్రయాణం చేశాడు.

చిత్ర ఒకసారి అద్దంలో చూచుకుని నవీన్ వెంట వచ్చి మోటార్ బైక్ ఎక్కింది.

నవీన్ చిత్రను చూశాడు.

చిత్ర తను మామూలుగ వేసుకునే పంజాబిడ్రస్‌లోవుంది. అవి చిత్రకు అలవా టైన దుస్తులు.

"చిత్ర నీ రంగు — పొడుగు—దుస్తులు చూచి ఏ పంజాబి పిల్లనో తెచ్చాను అను కుంటారు. చక్కగా నూరు పైసల తెలుగు




మాత్రయిలా చీర కట్టుకునిరా" అన్నాడు.

చిత్ర యింటికి కాస్త దూరంలో ఆపి, "త్వరగా రా" అన్నాడు.

చిత్ర పరుగున ఇంట్లోకి వచ్చింది. బెనారస్ చీర కట్టుకుని, జడలో పూలు పెట్టుకుని నుదుట కుంకుమ దిద్దుకుంటుంటే....

"ఎక్కడికే పెళ్ళి కూతురులా తయారై పోతున్నావు!" అని అక్క శిల్ప అడిగింది.

"వచ్చాక చెప్పుతాను ఓ కథ"

"సస్పెన్స్‌లో పెట్టి చంపక చెప్పిపోరాదూ."

శిల్ప అసలు సస్పెన్స్‌ను భరించలేదు. నవల ప్రారంభించి నాలుగు పేజీలు చదివి గబుక్కున వెనక పేజీలు తిప్పుతుంది. సమాప్తం చదివాక తిరిగి ప్రారంభిస్తుంది. 'మరో నిముషం వుంటే ప్రశ్నలు కురిపిస్తుంది లేదా వెంట వస్తుంది. బాబోయ్!' అనుకుంటూ పరుగు పెట్టింది.

ఎదురైన అమ్మకు పాదాభివందనం చేసి – వెనక్కి తిరిగి చూడలేదు - అమ్మ చెప్పేది, అడిగేది, వినిపించుకోలేదు. పరుగున వెళ్ళింది రోడ్డుమలుపు తిరిగింది, అంత వరకు నవీన్ ఎక్కడ వున్నాడో కాని రంయ్ మంటూ వచ్చాడు.

"చిత్రా! యు ఆర్ బ్యూటీఫుల్, ఐ లవ్ యు" ఈ స్త్రీ తనదే అన్నట్లు గర్వంగా చూస్తుంటే ఐదు సంవత్సరాల నుంచి ఈ మాటే వింటున్న చిత్ర ముసిపెంగ సిగ్గుగా నవ్వుతూ వెంగున ఎక్కి కూర్చుంది.

నవీన్‌కు అందమైన చిత్రను చూస్తుంటే గర్వంగా, వుద్వేగంగా, ఇంటికి తీసుకు పోతుంటే ఆనందంగా వుంది.

చిత్రకు పరీక్షకు పోతున్నట్లు గుండె దడ దడ మని కొట్టుకుంటుంటె నవీన్ వీపు మీదకు వొరగబోయింది... అంతే మెరుపు మెరిసినట్లయింది

పైట జారి పోవటం చిత్రకు తెలియనే తెలీదు!

చక్రంలోపడి చుట్టుకుపోయి యమపాశంలా పట్టి లాగేసింది. చిత్ర తల నేలకు కొట్టుకుంది. ఏం జరిగిందో చూస్తున్న, గుర్తించలేనట్లు గుడ్డిగా పోస్తున్న నవీన్‌కు గుడ్‌బై చెప్పుతున్నట్లుగా చెయ్యి మాత్రం కదలి కదలి ఆగిపోయింది. కాని చిత్ర పెదాలపై చిరునవ్వు చిత్రంగా నిలిచి పోయింది.

మానవ జీవితంలో మృత్యువు కంటె గొప్ప సస్పెన్స్ ఏముంది.

మృత్యువు ఏ క్షణాన ? ఎప్పుడు ? ఎక్కడ! వస్తుందో-వూహాకందని మృత్యువే గొప్ప సస్పెన్స్ థ్రిల్లర్-చిత్రకు ఆ సస్పెన్స్ తెలిసిపోయినట్లు నవ్వుతూంది... ※